# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 24, మార్చి 2026




## గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిటిడిఓ

**లక్షెట్టిపేట, మార్చి 23, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను మంచిర్యాల ఇంచార్జి డిటిడిఓ రమాదేవి సోమవారం రోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమపాఠశాల అన్ని వసతులు పరిశీలించి ప్రభుత్వం ద్వారా ద్వారా అందజేయబడుచున్న అన్ని వస్తువులు విద్యార్థులకు పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలన చేశారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ..10వ తరగతిలోని 35 మంది విద్యార్థినులు శ్రద్ధగా పరీక్షలు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని ఆదేశించారు. 10వ తరగతి మొత్తం 35 మంది విద్యార్థినులు అందరూ ఉత్తీర్ణులు అయ్యేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకొని ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. అనంతరం వసతి గృహము, పాకశాల, హాస్టల్ పరిసరాల పరిశుభ్రుతను పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో ఏటిడిఓ సురేష్, ఏసిఎంఓ లక్ష్మయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగు సత్యనారాయణ, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి బండ్ల జీవరత్నం, హాస్టల్ వార్డెన్ రేవతి, మడావి శంకర్, రజిత, వినోద సిబ్బంది పాల్గొన్నారు.

### పదో తరగతి పరీక్షలు

## సజావుగా నిర్వహించాలి

✦ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 23, ప్రభాతవార్త :**

పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం గ్రామంలో శాంతినికేతన్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణపై ఆమె సవివరంగా పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించారా, కూర్చునే ఏర్పాట్లు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల వంటి ప్రాథమిక వసతులు సక్రమంగా ఉన్నాయా అనే విషయాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అదేవిధంగా పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పరీక్షల సమయంలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో డ్యూటీ నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్లు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా, ధైర్యంగా పరీక్షలు రాయాలని ప్రోత్సహించారు. పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎలాంటి అంతరాయాలు లేకుండా పరీక్షలు విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన ఈ పరీక్షలను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని ఆమె స్పష్టం చేశారు. అనంతరం జంబుగా నుండి పెద్ద బండ రహదారి మధ్యలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వంతెన పనులను పరిశీలించి వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రహదారి పనులు త్వరగా పూర్తిచేసి వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారుఈ తనిఖీలో సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### పాడి రైతులు పశువులకు

## తప్పనిసరిగా టీకా వేయించాలి

✪ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, మార్చి 23, ప్రభాతవార్త**

పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో జిల్లా పశుసంవర్ధక, పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల సంచార వాహనాన్ని జిల్లా పశు వైద్య శాఖ అధికారి యాకుబ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాడి రైతుల ఆర్థిక అభివృద్ధి, పశువుల సంక్షేమం దిశగా ప్రభుత్వం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, మార్చి 10వ తేదీ నుంచి ఏప్రిల్ 9వ తేదీ వరకు 8వ విడత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పాడి పశువులు, మేకలు, గొర్రెలు, పౌల్ట్రీ ఫారాలలో మిగతా 2లో..






## షీటీం ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 23, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, బట్‌పల్లి గ్రామంలో షీ టీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ షీ టీం ఇన్‌చార్జి ఏఎస్‌ఐ సునీత మాట్లాడుతూ విద్యార్థినులకు మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, ఆపద సమయంలో ఎలా స్పందించాలి, డయల్ 112 వినియోగం, సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని, ఎలాంటి వేధింపులు ఎదురైన వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా సమస్యలకు గురైతే కాగజ్‌నగర్ షీ టీం నంబర్ 8712670565 కు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇన్చార్జి ఆనంద్ బాబుతో ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు బి.రమాదేవి, శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తులు

## త్వరగా పరిష్కరించాలి

**ఉట్నూర్, మార్చి 23,ప్రభాత వార్త :**

ప్రతీ సోమవారం ప్రజావాణికార్యక్రమంలో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్క రించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ ఐటీడీఏ పివో యువరాజ్ మార్మాట్ అన్నారు. సోమవారం కార్యాలయం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం ఉమ్రి సాలెగూడ గ్రామానికి చెందిన టెకం భీంరావ్ తమా గ్రామానికి రోడ్డు మంజూరు కల్పించామని, బజారహత్నూర్ మిగతా 2లో..



## పాడి రైతులు పశువులకు తప్పనిసరిగా టీకా వేయించాలి

(మొదటిపేజీ తరువాయి)

గాలికుంటు వ్యాధి నివారణ దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పశు వైద్యాధికారులు అందుబాటులో ఉన్నారని, పాడి రైతులు తమ పశువులకు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

మండలం భూతాయి గ్రామానికి చెందిన మాడవి జైతు తమ గ్రామానికి మహిళ సంఘ భవనం మంజూరు కొరకు అర్జీ కోరారు. సిర్పొంద మండలం సుంకిడి గ్రామానికి చెందిన కుంరం మధుకర్ తనకి ఏదైనా గిరిజన ఆశ్రమ పాఠశాలలో వంట వండే పని కల్పించామని అర్జీ కోరారు,వివిధ ప్రాంతానుండి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మం జూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధిం చిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: సాక్ పెళ్లి సురేందర్

సారంగాపూర్, మార్చి 23, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాక్ పెళ్లి సురేందర్ సూచించారు. సోమవారం మండలంలోని తాండ్ర (జి) గ్రామంలో ఆయన పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, నాణ్యమైన విద్యుత్ సరఫరా వంటి హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభ దశకు చేరుకోవడం శుభపరిణామమని, జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. రాష్ట్రంలో ఎకరం భూమి ఉన్న రైతులకు రూ.6,000 రైతు భరోసా నిధులను విడుదల చేసినందుకు ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సంక్షేమ పాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని సురేందర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మార్చి 23, ప్రభాతవార్త

ప్రజావాణి కార్యక్రమంలో అందిన అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బాధితుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కుల ధ్రువీకరణ పత్రాలు, భూమి పట్టా సవరణలు, ఎన్‌ఓసీ జారీ, ఓపెన్ కాస్ట్ మైనింగ్ నష్టపరిహారం వంటి అంశాలపై పలువురు అర్జీదారులు వినతులు అందజేశారు. ముఖ్యంగా సన్నరకం వడ్లకు రావాల్సిన బోనస్ డబ్బులు ఇప్పించాలని మందమర్రి రైతులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి: ఎమ్మెల్యే

నేరడిగొండ, మార్చి 23, ప్రభాతవార్త:

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా "బడాయిలు చాలించు బకాయిలు చెల్లించు" అంటూ రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. ఫీజుల చెల్లింపులో జరుగుతున్న ఆలస్యం వల్ల వేలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల నుంచి సర్టిఫికెట్లు రాక, పైచదువులకు వెళ్లలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.



నిరసన తెలుపుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న డిఆర్‌డిఓ కిషన్

## పలు అభివృద్ధి పనుల పరిశీలన

హాజీపూర్, మార్చి 23, ప్రభాతవార్త

మండల ప్రత్యేక అధికారి డిఆర్‌డిఓ కిషన్ సోమవారం మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. హాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని, రాపల్లిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను, ఇంకుడు గుంతలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

## చర్మం పై స్పర్శ లేని మచ్చలు ఉంటే వైద్య సిబ్బందిని సంప్రదించాలి

### - కుష్టు నివారణ కార్యక్రమ జిల్లా అధికారి డా. సుధాకర్ నాయక్

హాజీపూర్, మార్చి 23, ప్రభాతవార్త



మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల డివిజన్ కార్యాలయం వద్ద వ్యాధి నిర్ధారణ ఉద్యమ సర్వే కార్యక్రమాన్ని కార్పొరేటర్ బియ్యాల త్రివేణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్టు నివారణ కార్యక్రమ అధికారి డా.సుధాకర్ నాయక్ హాజరై మాట్లాడుతూ ఈ ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా మీ ఇళ్లకు వచ్చే మా వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కుష్టు వ్యాధి ఇంకా సమాజంలో కొంత మేర కొనసాగుతున్నదని, దీనిని త్వరగా గుర్తించి చికిత్స అందించడం ద్వారా పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు. ఈ సర్వే ద్వారా గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికి వెళ్లి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, వారికి ఉచితంగా చికిత్స అందించడం ముఖ్య లక్ష్యమని చెప్పారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త బాధ్యతతో పని చేసి, అనుమానిత కేసులను గుర్తించి వెంటనే జిల్లా కార్యాలయానికి తెలియజేయాలని ఆయన సూచించారు. ప్రజల్లో అపోహలు, భయాలను తొలగించి, కుష్టు వ్యాధి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డెమో వెంకటేశ్వర్లు, డిపిఎంఓ రాఘవయ్య, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, హెచ్ఈఓ రఘుపతి, ఎంఎల్‌హెచ్‌పి డా. సాయి ప్రసన్న, ఏఎన్ఎంలు పద్మ, వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి రక్షణ టీకాలు

పెంచికల్‌పేట్, మార్చి 23, ప్రభాతవార్త :



మండలంలోని దరోగపల్లి గ్రామపంచాయతీలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సోమవారం సర్పంచ్ బొట్టుపల్లి కృష్ణవేణి హరీష్ ఆధ్వర్యంలో పశువైద్యాధికారి డాక్టర్ రాకేష్ చేపట్టినారు. గ్రామంలోని పశువులు, మేకలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలను రైతులు, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పశువైద్య సిబ్బంది శివ, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

## జిల్లా రెండవ ఉప గవర్నర్‌గా లయన్ డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్

మంచిర్యాల, మార్చి 23, ప్రభాతవార్త



లయన్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 320జి జిల్లా గవర్నర్‌గా లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న లయన్ మోర బ్రదేశం ఎన్నికయ్యారు. జిల్లా ప్రథమ ఉప గవర్నర్‌గా లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న లయన్ గుంటక చంద్ర ప్రకాష్ ఎన్నికయ్యారు.జిల్లా రెండవ ఉప గవర్నర్‌గా లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల గౌతమి నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న లయన్ డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్ ఎన్నికయ్యారు.ఆదివారం నాడు సాయంత్రం కరీంనగర్ లో వసుధ కన్వెన్షన్ లో నిర్వహించిన 320జి లయన్స్ సమ్మేళనంలో జరిగిన ఎన్నికల్లో కొత్త లీడర్లను ఎన్నుకున్నారు. జిల్లా రెండవ ఉప గవర్నర్ పదవి కోసం హోరా హోరీ పోరు కొనసాగింది. మొత్తం 210 ఓట్ల కు గాను 207 ఓట్లు పోలయ్యాయి. లయన్ డా. ఉదారి చంద్రమోహన్ గౌడ్‌కు 107 ఓట్లు రాగా, లయన్ ఇనుగుర్తి రమేష్‌కు 67 ఓట్లు పోలయ్యాయి. లయన్ దుద్దిల్ల నారాయణరావుకు 33 ఓట్లు వచ్చాయి. మొదటి రౌండ్‌లోనే విజయం ఖాయమైంది. ఈ విజయానికి సహకరించిన లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల గౌతమి సభ్యులకు, జిల్లా సభ్యులకు చంద్రమోహన్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల ముందడుగు

పెంచికల్‌పేట్, మార్చి 23, ప్రభాతవార్త :

ప్రపంచ వాతావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని కిరణ్ మోడర్న్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో పండ్ల మొక్కలు నాటించడం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వేముల సాయికిరణ్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు ప్రపంచానికి పెద్ద సవాలుగా మారాయని, ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చెట్లు నాటడం, నీటి సంరక్షణ వంటి అలవాట్లను అలవార్చుకోవాలని విద్యార్థులకు తెలిపారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సాహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు



ఎన్నికైన హిందూ సమ్మేళన నిర్వహణ సమితి నూతన కార్యవర్గ సభ్యులు

## హిందూ సమ్మేళన నిర్వహణ సమితి నూతన కార్యవర్గ ఎన్నిక

**భైంసా, మార్చి 23, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని గణేష్ నగర్ మున్నూరు కాపు సంఘ భవనంలో సోమవారం హిందూ సమ్మేళన నిర్వహణ సమితి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమితి అధ్యక్షుడిగా తోట రాము, ఉపాధ్యక్షుడిగా అల్లెం సుదర్శన్, కార్యదర్శిగా దొంతుల సురేష్ బాధ్యతలు చేపట్టారు. అలాగే కోశాధికారిగా కొజ్జోల్ల గణపతి, సహ కార్యదర్శిగా కనికరం పోశెట్టిలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని గణేష్ నగర్ బస్తీ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై అభినందించారు. ఈ సమావేశంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జిల్లా సహకార్యవాహ ఉప్పు అరుణ్ రాజ్, సభ్యులు గోసల్ల రాకేష్, సళ్ళల్లో నరేష్, పోశెట్టి, పెరుగు నవీన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు. హిందూ సమాజ ఐక్యతకు, సేవా కార్యక్రమాలకు నూతన కమిటీ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## నేడు అడెల్లి మహాపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

**సారంగాపూర్, మార్చి 23, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం అడెల్లి మహా పోచమ్మ ఆలయ హుండీ ఆదాయ లెక్కింపు మంగళవారం ఉదయం నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి, కార్యనిర్వహణాధికారి భూమయ్య ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న భక్తులు ఎవరైనా ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని వారు తెలిపారు. ఆలయ ధర్మకర్తలు, స్వచ్ఛందంగా పాల్గొనే భక్తులు మంగళవారం ఉదయం 10 గంటల లోపు ఆలయ ప్రాంగణానికి చేరుకోవాలని కోరారు. పారదర్శకంగా జరిగే ఈ లెక్కింపు ప్రక్రియలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సహకరించాలని ఆలయ చైర్మన్ విజ్ఞప్తి చేశారు.

## బోథ్ నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి రూ. 45 కోట్లు మంత్రి కోమటిరెడ్డి హామీ

**నేరడిగొండ, మార్చి 23, ప్రభాతవార్త:**

బోథ్ నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు కీలక రహదారులు, వంతెనల నిర్మాణానికి సంబంధించి ఆయన మంత్రికి వినతిపత్రం సమర్పించారు. బోథ్ పట్టణంలో బీటీ రోడ్డు, సీసీ రింగ్ రోడ్డు, విద్యుత్ దీపాల ఏర్పాటుకు రూ. 5 కోట్లు, పోచ్చర ఎక్స్ రోడ్డు నుండి బోథ్ టౌన్ వరకు ఫోర్ లైన్ రహదారి, సెంట్రల్ లైటింగ్, మైనర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 38 కోట్లు, ఇచ్చోడ మండల కేంద్రంలో ఫోర్ లైన్ నిర్మాణంలో భాగంగా సైడ్ డ్రైన్ల ఏర్పాటుకు రూ. 2 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే విన్నపంపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ పనులకు సంబంధించి తక్షణమే నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. నిధుల మంజూరుకు అంగీకరించిన మంత్రికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



# భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లకు ఘన నివాళులు



నివాళులు అర్పిస్తున్న మాజీ ఆర్మీ రాజేష్ దంపతులు



**మందమర్రి, మార్చి 23, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని మనోవికాస్ మానసిక వికలాంగుల పాఠశాలలో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆర్మీ జవాన్ రాజేష్ పీవ్ హాల్, రాణి పీవ్ హాల్ దంపతులు పాల్గొని వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాజేష్ పీవ్ హాల్ మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. 1907 సెప్టెంబర్ 28న పంజాబ్‌లోని లియాల్‌పూర్ జిల్లా బంగా గ్రామంలో జన్మించిన భగత్ సింగ్ చిన్నప్పటి నుంచే దేశభక్తి భావాలతో పెరిగారని అన్నారు. జలియన్‌వాలాబాగ్ ఘటన ఆయనను తీవ్రంగా ప్రభావితం చేసి స్వాతంత్ర్య సమరంలోకి నడిపిందని వివరించారు. హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషించిన భగత్ సింగ్, లాలా లజపత్ రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ అధికారిగా భావించిన జాన్ సాండర్స్‌ను హతమార్చారని పేర్కొన్నారు. అలాగే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అసెంబ్లీలో బాంబులు విసిరి ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో యువతలో జ్వాలలు రగిలించారని తెలిపారు. జైలులో రాజకీయ ఖైదీల హక్కుల కోసం దీర్ఘకాల నిరాహార దీక్ష చేసిన ఆయన, చివరికి 1931 మార్చి 23న లాహోర్ జైలులో రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లతో కలిసి ఉరితీయబడ్డారని చెప్పారు. వీరి త్యాగం భారత స్వాతంత్ర్యానికి మార్గదర్శకమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని వీర వీరుల త్యాగాలను స్మరించుకున్నారు.

**మందమర్రి, మార్చి 23, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా మందమర్రి మండల కేంద్రంలో భగత్ సింగ్ రెవల్యూషన్ స్వచ్ఛంద సంఘం ఆధ్వర్యంలో సోమవారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎండి అక్బర్ ఖాన్, వ్యవస్థాపకుడు అనిల్ భగత్, పట్టణ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గండ్ల సంజీవ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కడారీ శ్రీధర్ తదితరులు పాల్గొని భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లతో పాటు రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్, రాజేంద్ర లాహిరి, చంద్రశేఖర్ ఆజాద్, ఠాకూర్ రోషన్ సింగ్, సుభాష్ చంద్రబోస్, సీనియర్ జర్నలిస్ట్ ఎండి మునీర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గండ్ల సంజీవ్ కుమార్, కడారీ శ్రీధర్ మాట్లాడుతూ భగత్ సింగ్ రెవల్యూషన్ సంఘం గత దశాబ్దన్నర కాలంగా సమాజ సేవలో విశేష కృషి చేస్తోందని తెలిపారు. అన్నదానం, మెగా రక్తదాన శిబిరాలు, అత్యవసర రక్తదానం, వైద్య శిబిరాలు, అనాధ మృతదేహాలకు అంత్యక్రియలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 50 వేలకుపైగా నోట్‌బుక్స్ పంపిణీ, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత, చలివేంద్రాల ఏర్పాటు, మజ్జిగ పంపిణీ, అవగాహన సదస్సులు, ఓటు హక్కుపై కరపత్రాల పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల ప్రశంసలు పొందిందని అన్నారు. ఈ సేవలకు గుర్తింపుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కలెక్టర్లు, మంత్రులు, ఎస్పీల చేతుల మీదుగా 25కు పైగా అవార్డులు అందుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. అనంతరం అనిల్ భగత్, అక్బర్ ఖాన్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలు దేశ యువతకు స్ఫూర్తి అని అన్నారు. విప్లవం అంటే కేవలం బాంబులు, తుపాకులు కాదు, సమాజంలో మార్పు తీసుకురావడం, అన్యాయాలను ప్రశ్నించడం అని తెలిపారు. వీర విప్లవకారుల త్యాగం నేటికీ యువతలో జ్వాలలు రగిలిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రాజు, శ్రీనివాస్, జీడి సారంగం, ఎండి జుబేర్, జిలకర సంపత్, మండల రాజు, గడ్డం కృష్ణకాంత్, డి.జీ చొప్పదండి స్వామి, దూడపాక శ్రీనాథ్, మర్రి మహేష్, బాబా, వెంకటేష్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

**బెల్లంపల్లి, మార్చి 23, ప్రభాతవార్త**

దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ సింహం భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని రామ టాకీస్ సెంటర్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఎంసిపిఐ(యు) పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి, ఎఐఎఫ్డిఎస్ రాష్ట్ర సహాయకార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ తదితర నాయకులు పూలమాలలు వేసి ఘనంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భగత్ సింగ్ చిన్న వయసులోనే దేశభక్తి జ్వాలలతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, రాజ్ గురు, సుఖ్ దేవ్ లతో కలిసి స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో బాంబులు విసిరి, "ఇంక్విలాబ్ జిందాబాద్" నినాదాన్ని దేశవ్యాప్తంగా మారుమ్రోగించిన మహా విప్లవకారుడని కొనియాడారు. ఉరికొయ్యలను చిరునవ్వుతో ముద్దాడుతూ ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్ యువతకు ఎప్పటికీ స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన మరణం దేశంలో విప్లవోద్యమానికి నాంది పలికిందని, యువతలో చైతన్యాన్ని రగిలించిందని, ప్రజలను పోరాటపథంలోకి నడిపించిందని తెలిపారు. నాయకులు మరింతగా మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినా, అమరుల కలలు ఇంకా నెరవేరలేదని, అధికార మార్పు మాత్రమే జరిగిందని విమర్శించారు.

తెల్లదొరలు పోయి నల్లదొరలు వచ్చారే తప్ప ప్రజల జీవన పరిస్థితుల్లో గణనీయమైన మార్పు రాలేదని అన్నారు. పేదరికం, దోపిడి, నిరుద్యోగం, విద్యావైద్య సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, బడుగు బలహీన వర్గాలు రోజువారీ జీవితంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతి, ప్రజావ్యతిరేక విధానాల వల్ల సాధారణ ప్రజలు బ్రతుకు బండి లాగలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. అందుకే భగత్ సింగ్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని, యువత నడుము కట్టుకుని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దోపిడి పాలనకు ముగింపు పలికి, జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ(యు) జిల్లా సహాయ కార్యదర్శి, ఎఐఎఫ్డివై రాష్ట్ర ఉపాధ్యక్షులు పసులేటి వెంకటేష్, పార్టీ పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్, సతీష్, పోషన్న, షేక్ మహ్మద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# డ్యూటీకి డుమ్మా కొడితే కఠిన చర్యలు తప్పవు..!

## - మందమర్రి ఏరియాలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం




**మందమర్రి, మార్చి 23, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియాలోని వివిధ గనులు, విభాగాలలో సంక్షేమ కార్యకలాపాలు, సిబ్బంది నిర్వహణపై డిజిఎమ్ పర్సనల్ అశోక్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఏరియాలోని సీనియర్ పర్సనల్ ఆఫీసర్లు, వెల్ఫేర్ ఆఫీసర్లు, పర్సనల్ ఆఫీసర్ అసిస్టెంట్లు, డీలింగ్ క్లర్కులు పాల్గొన్నారు. 2022 నుండి 2025 వరకు దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగుల పరిస్థితిని సవివరంగా చర్చించారు. 2022 సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణా కేసుల ప్రస్తుత స్థితిపై డిజిఎమ్ అశోక్ సమీక్ష నిర్వహించారు. విధులకు వరుసగా గైర్హాజరవుతున్న ఉద్యోగులపై తీసుకుంటున్న చర్యల్లో ఎటువంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. దీర్ఘకాలికంగా విధులకు దూరంగా ఉన్న ఉద్యోగులకు వెల్ఫేర్ ఆఫీసర్ల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి, వారి సమస్యలను తెలుసుకుని తిరిగి విధుల్లో చేరేలా ప్రోత్సహించాలని సూచించారు. వై.డి.ఏ.ఎం.ఎస్. డేటా అప్‌డేషన్‌పై కూడా ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పోర్టల్‌లో ఖచ్చితంగా నమోదు చేయాలని డీలింగ్ క్లర్కులు, అసిస్టెంట్లను ఆదేశించారు. డిజిటల్ రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. దీర్ఘకాలిక గైర్హాజరీ వల్ల ఉత్పత్తి, ఉత్పాదకత దెబ్బతినకుండా పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించి తుది నివేదికలు సమర్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సంస్థ నియమ నిబంధనలకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం సహించబోదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డివైపిఎం ఆసిఫ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్లు సందీప్, వంశీ, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు, వివిధ గనుల సంక్షేమాధికారులు, సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసితులకు సరైన పరిహారం అందించాలి

**జైపూర్, మార్చి 23, ప్రభాతవార్త**

మంచిర్యాల నుండి విజయవాడ వయా జైపూర్ మండలం నుంచి వెళుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసితులకు సరైన పరిహారం అందించాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపాల్‌పూర్, వేలాల, కిష్టాపూర్, రుమ్మీపూర్, కుందారం, బెజ్జాల, ఎల్కంటి, నర్సింగాపూర్, శేట్‌పల్లి, టేకుమట్ల, ఇందారం గ్రామాల భూ నిర్వాసితులకు ఒక్కో ఎకరానికి 20 లక్షల 80 వేల రూపాయల పరిహారం అందజేస్తామని, 18 లక్షల రూపాయలు చెల్లించారని, మిగిలిన మొత్తం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగానే సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుందిళ్ల మల్లేష్, రామ్ రెడ్డి, భూమయ్య గౌడ్, రాజారామ్, రాజ సమ్మయ్య, రాజయ్య, లింగయ్య, తిరుపతి, సడవలయ్య, సతీష్, రాయమల్లులు పాల్గొన్నారు.




## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు: తాడేవార్ సాయినాథ్

**భైంసా, మార్చి 24, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గళమె త్తుతున్న ప్రతిపక్ష నాయకులను అక్రమ అరెస్టులతో అణి చివేయలేరని బీజేపీ జిల్లా కార్యదర్శి, అడ్వకేట్ తాడేవార్ సాయినాథ్ పేర్కొన్నారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు భైంసా పట్టణ అధ్యక్షుడు రావుల రాముతో పాటు సాయినాథ్‌ను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు పిలుపు మేరకు చేపట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకే ప్రభుత్వం ఇలాంటి నిర్బంధాలకు పాల్పడుతోందని విమర్శించారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. అవినీతి, అరాచక పాలనను ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకుల గొంతు నొక్కాలని చూడటం సిగ్గుచేటని, ఇది ప్రజా పాలన కాదని, పోలీసుల నిర్బంధ పాలన అని వారు ధ్వజమెత్తారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల పక్షాన తమ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. ఈ అరెస్టులను బీజేపీ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి.

## వృద్ధురాలు ఆత్మహత్య

**నస్పూర్, మార్చి 23, ప్రభాతవార్త**

సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో పల్లపు సుబ్బమ్మ (70) అనే వృద్ధురాలు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మహారాష్ట్రకు చెందిన ఈమె బతుకుదెరువు కోసం నస్పూర్ వచ్చి టీ హోటల్‌లో పనిచేస్తూ ఒంటరిగా నివసిస్తోంది. మద్యానికి బానిసైన ఆమె మూడు రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. సోమవారం ఇంటి నుండి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌హెచ్ఓ మేకల ప్రశాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డీసీసీ ప్రధాన కార్యదర్శిగా పుల్లూరి లక్ష్మణ్‌కు ఘన సన్మానం

### - అభినందనలు తెలిపిన యూత్ కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానం

**మందమర్రి, మార్చి 23, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పుల్లూరి లక్ష్మణ్‌ను మందమర్రి యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మండల యువజన వైస్ ప్రెసిడెంట్ మాయ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మందమర్రిలోని ఆయన నివాసానికి వెళ్లిన నాయకులు పుల్లూరి లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నియామకం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని, స్థానిక స్థాయిలో కార్యకర్తలకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు అసెంబ్లీ జనరల్ సెక్రటరీ నిరటి వెంకటేష్, మందమర్రి మండలం సెక్రటరీ సయ్యద్ సహజ్, మూడరపు శేఖర్, చిప్పకుర్తి శశిధర్, ధనక్, సూరజ్, రాజేష్, గజల నరేష్, రామసాని సురేందర్, చలుమల మహేష్, పెద్ద అక్షయ్, జక్కుల తిరుపతి తదితర యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## దేగాం బస్టాండ్ వద్ద చలివేంద్రం ప్రారంభం

**భైంసా, మార్చి 24, ప్రభాతవార్త:**




వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు భైంసా మండలం దేగాం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వ ం ం గ ళ వా ం ం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి ఈ కేంద్రాన్ని ప్రారంభించి ప్రజలకు తాగునీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై ఉన్న బస్టాండ్ వద్ద ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాటసారులు, వాహనదారులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కారగిరి భోజన్న, ఉపసర్పంచ్ బాలేకర్ శివాజీ, వార్డు సభ్యులు మోహన్ రెడ్డి, ముఖేష్ పటేల్, వాగ్మారె సిద్దు, చోటు, లక్కడి ఆనంద్, కారోబారి సత్యం, పోల్కం యోగేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి: బిఆర్ఎస్ యువత

**క్యాతన్‌పల్లి, మార్చి 23, ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బి.ఆర్.ఎస్ అనుబంధ సంఘాల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ లను కొందరు ధ్వంసం చేశారని, వారిని గుర్తించి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం బిఆర్ఎస్ యువజన, విద్యార్థి సంఘాల నాయకులు రామకృష్ణపూర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరం ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి, యువజన విభాగం నాయకులు చెక్ పోస్ట్ వద్ద, పట్టణంలో పలు చోట్ల శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దురుద్దేశ్యంతో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ఫ్లెక్సీలు చించివేసి రాక్షస ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రిషి, కరుణాకర్, సాయి కృష్ణ, ఖలీం, శ్రీకాంత్ లు పాల్గొన్నారు.

## నీల్వాయి వారంతపు సంత వేలంపాట

### - రూ. 31 వేలకు దక్కించుకున్న దుర్గం తులసీరాం

**వేమనపల్లి, మార్చి 23, ప్రభాతవార్త**

మండల పంచాయతీ అధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం నీల్వాయి గ్రామ పంచాయతీ ఆవరణలో వారాంతపు సంత వేలంపాట నిర్వహించారు. సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేసి నీల్వాయి వారసంత 23 వేలు నిర్వహించగా వేలంపాటలో దుర్గం తులసిరాం రూ. 31 వేలు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్ ఉపసర్పంచ్ కాయిత శోభ తిరుపతి వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.



# పేకాట స్థావరంపై పోలీసుల దాడి



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

**- ముగ్గురు పేకాట రాయుళ్ల అరెస్ట్, నలుగురు పరారీ - నిందితుల వద్ద నుంచి నగదు, సెల్ ఫోన్లు, ద్విచక్రవాహనాలు స్వాధీనం**

**- చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: కోటపల్లి ఎస్సై రాజశేఖర్ హెచ్చరిక**

**చెన్నూరు, మార్చి 23, ప్రభాతవార్త**

చట్ట విరుద్ధమైన పనులు చేసినా, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే, అటువంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని కోటపల్లి ఎస్సై రాజశేఖర్ హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారంతో కోటపల్లి ఎస్సై రాజశేఖర్ తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టి పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను గుర్తించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకునే సమయంలో చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, మిగిలిన నలుగురు వ్యక్తులు పారిపోయినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి 4,050 రూ. నగదు, 4 మొబైల్ ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



పట్టుబడిన నిందితులు జనగామ మల్లేష్, మనుమల్ల అనిల్, గోగు నాగరాజు, పరారీలో ఉన్న నిందితులు గోగు రాజేందర్, గోగు సత్తన్న, కుంతి పోషం, మనుమల్ల వినోద్‌గా గుర్తించామని, నిందితులపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ, మండలంలో ఎవరైనా అక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడిలో కోటపల్లి హెడ్ కానిస్టేబుల్ బుజ్జిబాబు, టీజీఎస్పీ కానిస్టేబుళ్ల రాంప్రసాద్, సతీష్, సందీప్, రాజ్‌కుమార్ నరేష్ పాల్గొన్నారు.

## చేతి పంపుకు మరమ్మతులు

**వేమనపల్లి, మార్చి 23, ప్రభాతవార్త**

మండలంలోని ముల్కలపేట గ్రామంలో 8వ వార్డులో చెడిపోయిన చేతి పంపుకు సోమవారం సర్పంచ్ ఒడిల కళ్యాణి సుధాకర్ మరమ్మత్తులు చేపట్టారు. చేతి పంపు చెడిపోవడంతో కాలనీ వాసులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మెకానిక్ సాయంతో చేతి పంపులోని పైపులు తీసి కొత్త పరికరాలను వేసి మరమ్మతులు చేపించారు. చేతి పంపుల ద్వారా నీళ్లు రావడంతో చుట్టూ పక్కల కుటుంబాలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాలే శైలజ కిరణ్, శ్యామ్ సుందర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

## నస్పూర్‌లో శ్రీ సన్‌షైన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

**- కోల్‌బెల్ట్ ప్రజలకు అందుబాటులోకి ఆధునిక వైద్యం**

**నస్పూర్, మార్చి 23, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్‌లో సోమవారం శ్రీ సన్‌షైన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభమైంది. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య ఈ ఆసుపత్రిని ప్రారంభించారు. సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య వసతులను చేరువ చేసే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాల గదులను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జగన్ మోహన్ రావు ప్రారంభించారు. ఆపరేషన్ థియేటర్‌ను ఆసుపత్రి నిర్వాహకులు బోరిగం శ్రీనివాస్, వెంకటేష్ ప్రారంభించగా, పీడియాట్రీషియన్ సానా సుమలత ఓపీ సేవలను మొదలుపెట్టారు. కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజలకు అత్యవసర సమయాల్లో నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకుడు బోరిగం వెంకటేష్ తెలిపారు. సింగరేణి కార్మికులు, స్థానిక ప్రజలకు 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రత్యేక నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స అందిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఖాలీద్, సుదమల్ల హరికృష్ణ, రాచకొండ గోపాల్ రావు, తోట శ్రీనివాస్, శ్రీపతి శ్రీనివాస్, ఆసుపత్రి చైర్మన్ బోరిగం రాజారాం, ఐఎంఏ అధ్యక్షుడు రవిప్రసాద్, కోశాధికారి సంతోష్, కార్యదర్శి అనిల్ హాజరయ్యారు. ఎంపీఈవో సీపతి బాబురావు, కెమిస్ట్ డ్రగిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి తొగరు సుధాకర్, కోశాధికారి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల 11వ డివిజన్‌లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చెత్త, వ్యర్థాల తొలగింపు**

**నస్పూర్, మార్చి 23, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్‌లో సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ సుదమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో టీఎన్జీవోస్ కాలనీ, శ్రీపాద కాలనీ, వినూత్న కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ జి. అన్వేష్ హాజరయ్యారు. కాలనీవాసులు ఆయనకు మొక్కను అందించి స్వాగతం పలికారు. కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను జె.సి.బి సహాయంతో తొలగించారు. మురికి కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పారిశుద్ధ్య కార్యక్రమాల్లో కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొనడం పట్ల కమిషనర్ అన్వేష్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ కార్మికులకు అందించాలని ఆయన సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మేయర్, ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య సహకారంతో టీఎన్జీవోస్ కాలనీలో ప్రధాన రోడ్లు వేయించి సుందరంగా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ హరికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ వి. రాములు పాల్గొన్నారు. కాలనీవాసులు పొన్న మల్లయ్య, గుండేటి యోగేశ్వర్, సునీత, మల్లయ్య, సంజీవరెడ్డి, దామోదర్ రెడ్డి, సునీల్, శ్రీనివాస్, శ్యాంసుందర్, శారద స్వర్ణ, సిజ్జు తదితరులు పాల్గొన్నారు.






## ప్రారంభమైన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు

**ఉట్నూర్, మార్చి 23, ప్రభాత వార్త :**

ఉట్నూర్ పట్టణంలోని రామాలయంలో ద్వాజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంతోశ్ దుబే ఆధ్వర్యంలో పూర్ణాహుతి హోమం, మహాపూజ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తుల జైశ్రీరామ్ నినాదాలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని కమిటీ సభ్యులు వెల్లడించారు.



## ముందస్తు అరెస్టు చేయడం సరికాదు

**ఉట్నూర్, మార్చి 23, ప్రభాత వార్త :**

ఆరు గ్యారంటీల అమలు కోరుతూ బీజేపీ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. ఉట్నూర్ మండల నేతలను సోమవారం తెల్లవారుజామునే అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో తమను భయపెట్టలేరని, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం ఆపబోమని నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు రితేష్ రాథోడ్ హెచ్చరించారు. వీరిలో కొండరి రమేష్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

## ఉ సా వే నూతన కార్యవర్గం ఎన్నిక

**ఉట్నూర్, మార్చి 23, ప్రభాత వార్త :**



ఉట్నూర్ మండల కేంద్రంలో సోమవారం ఉట్నూర్ సాహితి వేదిక నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రాథోడ్ భీంరావు, అధ్యక్షుడిగా ముంజం జ్ఞానేశ్వర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా తొడసం కైలాష్, పవార్ వినోద్, ప్రధాన కార్యదర్శిగా జాదవ్ మురళి నియమితులయ్యారు. సభ్యుల ఎంపిక అనంతరం నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు. సాహిత్య రంగ అభివృద్ధికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు బంకట్ లాల్, మోతీరం, ఇందల, తిరుపతి తదితరులు పాల్గొన్నరు.

## అల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడిగా జేపీ నాయక్ నియామకం

**ఉట్నూర్, మార్చి 23, ప్రభాతవార్త**

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉట్నూర్‌కు చెందిన జేపీ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం నాయకులు ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ నాయకుడు అమర్ సింగ్ తిలావత్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. బంజారాల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతానని ఈ సందర్భంగా జేపీ నాయక్ స్పష్టం చేశారు.

